క్లుప్తంగా

ఈరన్నస్వామికి అభిషేక పూజలు


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు దేవాలయం ఆవరణంలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

క్రీడలకు సౌకర్యాలు కల్పించండి


క్రీడాశాఖ కార్యదర్శి వినయ్‌చంద్‌తో ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: నియోజకవర్గంలో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు, ప్లే గ్రౌండ్‌లు, ప్రేక్షకులకు కూర్చోవడానికి సౌకర్యాలు కల్పించాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి యువత మరియు క్రీడాశాఖ కార్యదర్శి వినయ్‌చంద్‌ని సోమవారం సెక్రటేరియట్‌లో కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్యాడ్మింటన్ కోర్టుల కోసం అధిక నాణ్యత గల మలేషియన్ వుడ్ ఫ్లోరింగ్‌తో సహా సమగ్ర క్రీడా సౌకర్యాలను సమకూర్చాలని కోరారు. లైటింగ్, టర్బో ఫ్యాన్‌లు, క్రికెట్ పిచ్, గడ్డి, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, టెన్నిస్, షటిల్, క్రికెట్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లకు అవసరమైన పరికరాలు కూడా మంజూరు చేయాలన్నారు.

హిందూ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలి


కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్.సుదర్శన్

ఆదోని రూరల్: పట్టణంలోని కొత్త బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న హిందూ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్.సుదర్శన్, సహాయ కార్యదర్శి విజయ్, నాయకులు రాముడు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. అలాగే పట్టణంలో వీధికుక్కల బెడద అధికంగా ఉందని, వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని విన్నవించారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం ఓ భక్తుడు విరాళం అందజేసి తమ భక్తిని చాటుకున్నారని ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్. వెంకటేష్ తెలిపారు. కోసిగి గ్రామానికి చెందిన విజయ్.. రిటైర్డ్ తహసీల్దారు లేట్ నరసప్ప, లేట్ సరోజమ్మగార్ల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్షను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, వేదాశీర్వచనలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ వెంకటేష్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం చేయాలి

కర్నూలు(సెంట్రల్): రజకులపై జరుగుతున్న దాడుల నివారణ కోసం రక్షణ చట్టాన్ని చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం రజక వృత్తిదారుల కార్యాలయంలో మాట్లాడుతూ.. నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో రజకులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. పట్టణాల్లో అపార్టుమెంట్ వాచ్‌మెన్‌లు, ఇస్త్రీదారులపై దాడులు జరుగుతున్నా నివారణకోసం ప్రభుత్వాలు చట్టాలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నంద్యాల జిల్లాలో లింగస్వామి, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సూర్యనారాయణ అనే రజకులను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఆళ్లగడ్డలో రజకుడైన శీనుపై దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయాలని కోరారు.

ఓటాన్ పేరుతో ప్రభుత్వం కుట్ర

- ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు
- అధికారంలోకి వచ్చాక అమలులో తాత్సారం
- పథకాలకు నిధులు ఎగ్గొట్టేందుకు తాత్కాలిక బడ్జెట్
- తల్లికి వందనం కోసం విద్యార్థులు, పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపులు



ఆదోని టౌన్/ఎమ్మిగనూరుటౌన్: ఎలాగోలా అధికారంలోకి రావాలని ఉద్దేశంతో కూటమి పార్టీలు ఎన్నికల్లో అమలుకు అలవికాని సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చింది. గత ప్రభుత్వం కన్నా రెండింతలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు చెప్పింది. అయితే అధికారంలోకి వచ్చాక హామీల అమలులో తాత్సారం చేస్తోంది. ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు నెలలు కావస్తున్నా సంక్షేమ పథకాల ఊసే లేదు. తాజాగా అసెంబ్లీలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ బడ్జెట్‌తో ప్రజలను మోసం చేస్తోంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో సంక్షేమాన్ని పక్కన పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. దీంతో భారీ స్థాయిలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల పరిస్థితి ప్రశ్నార్థకంగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండేళ్లు కరోనా సమయంలోనూ ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను వంద శాతం అమలు చేసింది. అయితే ఇప్పుడు ఉన్న సర్కార్ ఖజానా లేదంటూ మరో ఏడాది సంక్షేమ పథకాలను వాయిదా వేసే కుట్రకు తెరలేపింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో సీజన్ ప్రారంభంలోనే నగదు సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బడులు తెరిచిన వెంటనే విద్యార్థుల కోసం అమ్మఒడి, ఖరీఫ్ సీజన్ ప్రారంభమై తొలకరి జల్లులు పడిన వెంటనే రైతు భరోసా ఇచ్చి ఆదుకునేది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని.. తల్లికి వందనం, రైతు భరోసాను.. అన్నదాత సుఖీభవగా పేరు మార్చింది. ఇవే కాకుండా సూపర్ సిక్స్‌లో మిగిలిన హామీలు కూడా అమలు చేయాల్సి వుంది. ప్రభుత్వం ఏర్పాటై 40రోజులకు పైగా అయినప్పటికీ పథకాల అమలు ఊసేలేదు.

లబ్ధిదారులు ఎదురుచూపులు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఇంటికో విద్యార్థికి ఇచ్చిన అమ్మఒడి పథకం కింద 27 వేల మంది విద్యార్థులు లబ్ధిపొందారు. అయితే కూటమి ఇచ్చిన హామీలో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అన్న లెక్కల ప్రకారం దాదాపుగా 90వేల మందికి పైగా తల్లికివందనం పథకానికి అర్హులైన తల్లులు ఎదురుచూస్తున్నారు. ఆదోని నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి కింద 13,860 మంది లబ్ధి పొందారు. ప్రస్తుత తల్లికివందనం పథకానికి దాదాపు 20వేల మంది అర్హులున్నారు. అదేవిధంగా రైతు భరోసా కింద ఎమ్మిగనూరులో 44,476మంది, ఆదోనిలో 22,000 మంది లబ్ధిపొందారు. వీరందరూ అన్నదాత సుఖీభవ కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాల్సి వస్తుందని, ఓటాన్ అకౌంట్‌ను ప్రవేశపెడుతూ కాలం వెల్లదీస్తున్నారని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.

హామీలు నెరవేరేనా?

చేనేతపురి అయిన ఎమ్మిగనూరు పట్టణంలో నేతన్నలు ఎక్కువ ఉన్నందున వారికి టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన తన హామీని నిలబెట్టుకొని చేనేతలకు ఉపాధి నివ్వాలి.మూతపడిన స్పిన్నింగ్‌మిల్లు స్థానంలో మరొకటి ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. తుంగభద్ర దిగువ కాలువా కింద ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ కింద స్థిరీకరించిన 12,500 ఎకరాల ఖరీఫ్ ఆయకట్టులో పంటలు చేతికి వచ్చే వరకు సాగునీరందేలా అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు..అదేవిధంగా ఎత్తిపోతల పథకాలను సక్రమంగా నిర్వహించి పంటలకు నీరు అందేలా పనులు చేపట్టాల్సి ఉంది. ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మేజర్ గ్రామ పంచాయితీ అయిన గోనెగండ్లలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని, శిథిలమైన రోడ్లను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందులో కర్నూలు ప్రధాన రహదారితో పాటు కోసిగి రోడ్డు మరమ్మతులు, పునర్నిర్మాణాలకు ప్రధాన్యతనివ్వాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ముందుకు సాగుతున్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నా.. ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని పట్టణవాసులు విమర్శిస్తున్నారు. ఆదోని పట్టణంలో రోడ్లు వెడల్పు చేసి ట్రాఫిక్ సమస్యకు శాశ్వతంగా ఫుల్ స్టాప్ పెట్టాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. మహిళలకు సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని, భూ కబ్జాల సమస్యలు పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు. అలాగే పట్టణంలో నీటి సమస్య, మురుగు కాలువల అధ్వానం, కాలక్షేపం కోసం పార్కులు లేక రిటైర్డ్ ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు, విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రధానమైన ఆరు జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమలు మూతపడటంతో యువతకు ఉపాధి కరువయ్యిందని, పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి



ఎమ్మిగనూరులో అద్దెభవనాల్లో నిర్వహించే ఎస్సీ,బీసీ బాలుర,బాలికల హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి. సొంతభవనాలు లేక అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య విద్యార్థులు తమ చదువులు కొనసాగిస్తున్నారు. బాలికల సంఖ్య ఎక్కువ వున్నందున అదనంగా మరో బాలికల హాస్టల్ మంజూరు చేయాలి. నాడు- నేడు కింద పెండింగ్‌లో వున్న పనులు పూర్తి చేయించాలి, పట్టణంలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించాలి. – మహేంద్రబాబు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి, ఎమ్మిగనూరు

అభివృద్ధికి కృషి చేయాలి



ఆదోని ప్రాంతం ఒకప్పుడు రెండో ముంబాయిగా పేరుగాంచింది. కాలక్రమేణా మిల్లులు, ఫ్యాక్టరీలు మూతబడడంతో వెనకబడిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఆదోని అభివృద్ధికి కృషి చేయాలి. అవినీతికి తావులేకుండా ప్రజాప్రతినిధులు కృషి చేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆ దిశగా చర్యలు చేపట్టాలి. దీంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశం ఏర్పడుతుంది. – సుదర్శన్, ఆదోని

పెట్టుబడి సాయం అందించాలి



ఖరీఫ్ పంట సాగుకు పెట్టుబడి సాయం రూ.20వేలను రాష్ట్ర ప్రభుత్వం అందించాలి. కొత్త ప్రభుత్వం వచ్చి నెలదాటిపోయినా ఆ ఊసే ఎత్తడం లేదు. పంట సాగుకోసం పెట్టుబడుల్లేక బయట వడ్డీలకు డబ్బు తెచ్చుకోవాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదిరిగా సత్వరం రైతు భరోసా నిధులను మంజూరు చేయాలి. – రాముడు, రైతు, గంజిహళ్లి గ్రామం

ఇంతవరకూ సాయం ఇవ్వలేదు



మాకున్న 6 ఎకరాల్లో పత్తి సాగుచేశాం. ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం ఇంతవరకూ ఇవ్వలేదు. ఆ దిశగా మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదు. వ్యవసాయ పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. ప్రభుత్వం సాగుకు పెట్టుబడి సహాయం రూ.20వేలు ఇస్తామని ఇచ్చిన హామీని సత్వరం అమలు చేయాలి. – బజారి,రైతు, తిమ్మాపురం గ్రామం

ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించాలి



తల్లికివందనం, రైతు భరోసా నిధులను సత్వరం మంజూరు చేసేలా స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీ ఓటాన్ బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాలి. పెట్టుబడి సాయం లేక రైతులు అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న రూ.20వేలు, తల్లికి వందనం కింద ఇస్తామన్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈసమస్యను పరిష్కరించాలి. – పంపన్న గౌడ్, ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి, ఎమ్మిగనూరు

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్ఏలోకి వెళ్లకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి ఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్‌రఫీ, ఆర్డీఓ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆయా మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని...

- తమ కాలనీలో విద్యుత్ తీగలకు చెట్టుకొమ్మలు తగిలి షార్ట్ సర్క్యూట్ అవుతుందని, ఆ కొమ్మలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చేయాలని ఆదోని పట్టణంలోని కార్వన్‌పేటకు చెందిన నరసింహులు అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం మండిగిరి గ్రామానికి చెందిన అమీన్‌బాషాకు సంబంధించి సర్వేనంబర్ 619డీలో 0.25 భూమి, సర్వేనంబర్ 639లో 0.70 భూమి మొత్తం 0.95 ఎకరాల భూమి ఉందని, సదరు భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం కల్లుబావి గ్రామానికి చెందిన జయమ్మకు సంబంధించి సర్వేనంబర్ 235లో 3.36 ఎకరాలు సర్వేనంబర్ 239బీలో 0.30 విస్తీర్ణం భూమి, 239ఏలో 0.11 భూమి మొత్తం 3.77 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరుపై నమోదయ్యిందని, విచారణ చేసి ఆన్‌లైన్‌లో తన పేరుపై మార్చాలని ఆమె అర్జీ సమర్పించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హొళగుంద: మార్లమడికి వద్ద ఉన్న వేదావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను హొళగుంద పోలీసులు పట్టుకున్నారు. ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన వ్యక్తులు నదిలో అక్రమంగా ఇసుక తవ్వుకుని తీసుకెళ్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ పెద్దయ్య నాయుడు, సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని తదుపరి చర్యలు వారు తీసుకుంటారని పేర్కొన్నారు.

అనుమతిలేని మందులను విక్రయిస్తే చర్యలు


గోనెగండ్లలో పురుగు మందు షాపులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

గోనెగండ్ల : విత్తన డీలర్లు అనుమతి లేని మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని బడేసావలి, శ్రీ మల్లికార్జున స్వామి ట్రెడర్స్‌లను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ డీలర్లు పురుగు మందులకు సంబంధించి పీసీలు తప్పకుండా ఉంచుకోవాలన్నారు. అలాగే స్టాకు రిజిష్టరు, ధరల పట్టిక బోర్డును ప్రతి రోజు ప్రదర్శించాలన్నారు. మందులు కొనుగోలు చేసిన రైతుకు సంతకము చేయించుకొని రసీదు ఇవ్వాలని సూచించారు. బయోమందులు అమ్మే డీలర్లు తప్పకుండా జీ2, జీ3 సర్టిఫికెట్ ఉన్న మందులను విక్రయించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం


బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని రూరల్: మండలంలోని జాలమంచి గ్రామంలో యేసు(35) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామపెద్దలు విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందేలా చర్యలు చేపట్టారు. గ్రామ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీవీరేష్, నాయకులు శేఖరప్ప, శాంతకుమార్, వెంకటేష్, లక్ష్మయ్య, రామాంజనేయులు, నరసింహులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే అందించిన రూ.10 వేలను కుటుంబ సభ్యులకు అందించారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి


ఎంఈఓ వరప్రసాద్ దంపతులు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కౌతాళం : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎంఈఓ-2 శోభారాణి అన్నారు. కౌతాళం ఎంఈఓ-1గా పదవీ విరమణ పొందిన వరప్రసాద్‌కు ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరప్రసాద్ దంపతులతో పాటు ఇటీవల పదవీవిరమణ పొందిన రొడూరు మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం చంద్రశేఖరయ్య, ఉప్పరహాల్‌లో జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గంగధరయ్యలను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కౌతాళం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఇమ్మాన్యూయల్, ఏరిగేరి హెచ్ఎం రమేష్‌నాయుడు, సీనియర్ ఉపాధ్యాయులు అహ్మద్, సుధాకర్, విజయకుమారి, నర్సిములు, జీవిత, సుదర్శన్‌రెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు రేపు వేలాలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెబ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి వేలాలు ప్రారంభమవుతాయని సెబ్ సీఐ చెప్పారు. వేలాల్లో పాల్గొనే వారు 24వ తేదీ ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఆధార్, పాన్ కార్డు కాపీలను సెబ్‌స్టేషన్‌లో ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వేలాల్లో వాహనాలను పొందిన వారు వెంటనే నగదును చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కోసిగిలో..

కోసిగి: అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు ఈనెల 24వ తేదీన మండల కేంద్రంలోని సెబ్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా సోమవారం తెలిపారు. కోసిగి సెబ్ సర్కిల్ పరిధిలోని కోసిగి, పెద్దకడబూరు మండలాలలో అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడిన వాహనాలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామని, ఆసక్తి కలిగిన వారు రూ.3వేలు డిపాజిట్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వేలంలో వాహనం కొనుగోలు చేసిన తర్వాత 18శాతం జీఎస్టీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ఆదోని రూరల్: కౌతాళం మండలంలోని చిరుతపల్లి, మల్లన్నహట్టి, ఉరుకుంద, కామవరం, ఎరిగేరి గ్రామాల నుంచి ఆదోని పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల్లో చదివేందుకు వస్తున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని డీఎస్ఎఫ్ డిమాండ్ చేశారు. సోమవారం డీఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు నవీన్, వినిల్, హనుమేష్, రాజేష్, చరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే ఆదోని పట్టణంలోని గుజరాత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన బీసీ హాస్టల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట పీడీఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పీడీఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, డివిజన్ కార్యదర్శి శివ, మహిళా కన్వీనర్ నికిత, నాయకులు జాన్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి


మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్

ఎమ్మిగనూరుటౌన్: విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించి, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల విలీన ప్రక్రియ నిలిపివేయాలని, 84, 85, 117 జీఓలను తక్షణం రద్దు చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ఎస్సీ, బీసీ సంక్షేమ హస్టళ్ల సంఖ్యను పెంచి విద్యార్థులకు తగ్గట్టుగా కాస్మోటిక్ చార్జీలను పెంచాలని కోరారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో విద్యార్థిల కోసం శాశ్వత సీజనల్ హస్టళ్లను ఏర్పాటుపై అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు చర్చించాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి


ఆర్‌యూ వీసీతో జేఏసీ కన్వీనర్ శ్రీనివాసులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీ చేయాలని ఆదోని విద్యార్థి జేఏసీ కన్వీనర్ శ్రీనివాసులు రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎన్టీకే నాయక్‌ను కోరారు. నూతన ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎన్టీ నాయక్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సమస్యలను విన్నవించారు. ఇందుకు వీసీ సానుకూలంగా స్పందించారని చెప్పారు.